క్లుప్తంగా

సాయినాథునికి ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద వేంచేసిన షిరిడీసాయి ఆలయంలో గురువారం భక్తులు ఆలయ అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంతో మహిమ కలిగిన ఇక్కడ వేంచేసిన సాయినాథుని పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించారు. పాలువాయి గేటు గ్రామానికి చెందిన దారపునేని చెన్నయ్య, ఉమాదేవి దంపతులు భక్తులకు అన్నసంతర్పణ చేశారు. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

న్యాయమూర్తిని సన్మానించిన బార్ అసోసియేషన్ సభ్యులు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మురళీ గంగాధర్‌రావుకు గురువారం పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కోర్టు చాంబర్ హాల్‌లో మర్యాదపూర్వకంగా బార్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ముందుగా న్యాయమూర్తిని సన్మానించి, పుష్పగుచ్ఛాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

ఎంపీడీవో రత్నం




దాచేపల్లి : గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చాలని ఎంపీడీవో పప్పుల రత్నం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం గురువారం జరిగింది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేయించి బ్లీచింగ్ చల్లించాలని ఎంపీడీవో చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో ఈవోపీఆర్డీ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఉపవాస కూడికలు ప్రారంభం



విజయపురిసౌత్: స్థానిక గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చిలో డా.రెవరెండ్ పాస్టర్ దానియేలు ఆధ్వర్యంలో 40 దినాల ఉపవాస ప్రార్థన కూడికలను గురువారం ప్రారంభించారు. ముందుగా ఆయన చర్చి వద్ద పావురాలను ఎగురవేసి అనంతరం భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజలకు శాంతి, సమాధానం, క్షేమాన్ని మహోన్నతుడైన దేవుడు కలుగజేయాలని ప్రార్థించారు. సర్వ మానవాళి పాడిపంటలు, సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు. 2017 నుంచి ఈ ఉపవాస ప్రార్థన కూడికలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కూడికల ద్వారా అందరూ దేవుని సన్నిధిలో గడిపే అవకాశం లభిస్తుందన్నారు. ముందుగా భక్తులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ మహిమా దానియేలు, పాస్టర్లు, సంఘ విశ్వాసులు, భక్తులు పాల్గొన్నారు.

కంకణాలపల్లిలో రీ-సర్వే పునఃప్రారంభం



సత్తెనపల్లి: భూముల రీ సర్వే కంకణాలపల్లి గ్రామంలో గురువారం పునఃప్రారంభమైంది. ఇద్దరు సర్వేయర్లు, వీఆర్‌ఓ, వీఆర్‌ఏ బృందంగా.. మూడు బృందాలు 123 మంది రైతులకు చెందిన 25 సర్వే నంబర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోటవేటర్ ద్వారా భూమిపై నిజ నిర్ధారణకు పరిశీలన చేసి, గుర్తించారు. ఆ భూమిపై యాజమాన్య హక్కుల మేరకు పాస్ పుస్తకాల్లో విస్తీర్ణం నమోదై ఉందో లేదో పరిశీలించి, పత్రాలను నిర్ధారించారు.

మిషన్లతో కోత.. పశుగ్రాసానికి కొరత

- పశుగ్రాసం లేక మూగజీవాల అవస్థలు
- అధిక రేట్లకు కొనుగోలు చేస్తున్న పాడి రైతులు



యంత్రాలతో వరి కోస్తున్న దృశ్యం

గురజాల : యంత్రాలతో వరి కోతలు చేస్తుండటంతో పశుగ్రాసం కొరత ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో మూగజీవాలు ఆకలితో అలమటిస్తున్నాయి. పశువులను పెంచుకోవడానికి రైతులే తిరిగి పశుగ్రాసం కొనుగోలు చేయాల్సివస్తుంది. పశుగ్రాసం కొరతతో కొంత మంది రైతులు పశువులను పెంచలేక విక్రయించుకోవాల్సి వస్తుంది. నియోజకవర్గంలోని మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో పిడుగురాళ్ల సబ్ డివిజన్ పరిధిలో సుమారు 39,830 హెక్టార్లలో వరి సాగు చేశారు. కూలీల కొరత, ఖర్చు ఎక్కువగా ఉండటంతో యంత్రాలతో వరి కోతలు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు 40 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. పంట బాగున్నప్పటికీ దానిని యంత్రాలతోనే కోయాల్సి వస్తుందని, మిషన్ ద్వారా ధాన్యం కోతకు వాటిని బయటకు తీసుకువచ్చేందుకు కలిపి గంటకు రూ.3,400 వరకు ఖర్చు అవుతుందని రైతులు తెలుపుతున్నారు. ఎక్కువ మంది రైతులు యంత్రాలతోనే వరి కోతలు చేస్తున్నారు. కోతలు అయిన వెంటనే పొలాల్లోనే గడ్డికి నిప్పుపెట్టి బూడిద చేస్తున్నారు. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది.

వరి కోతలు ఖర్చుతో పని

కూలీలతో వరి కోతలు కోయించడం ఖర్చుతో కూడిన పని. కూలీల కొరతతో పాటు ఖర్చు కూడా ఎక్కువ. అంతేకాక పొలం దూరాన్ని బట్టి కూలీలు రేటు డిమాండ్ చేస్తున్నారు. చేనుకోత, ఆరబెట్టిన ఓగులు ఒడిపెలు వేయడానికి, ధాన్యాన్ని కొట్టించడానికి కలిపి సుమారు రూ.9 వేల నుంచి రూ.15 వేల వరకు ఎకరాకు ఖర్చు అవుతుంది. దీని వలన యంత్రాలను ఆశ్రయిస్తున్నామని రైతులు చెబుతున్నారు. దీంతో వరి గడ్డిని రైతులు అధిక ధరలకు విక్రయించాల్సి వస్తుందని అంటున్నారు.

వర్షానికి తడిస్తే ఇబ్బంది



యంత్రాలతో కోసిన వరిగడ్డి తడిస్తేనే ఇబ్బంది. తడవకపోతే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. యంత్రాలతో కోసిన గడ్డిని కుప్పగా ఉంచే యంత్రాలు సైతం అందుబాటులో ఉన్నాయి. 99 శాతం రైతులు యంత్రాలతో కోసేందుకు మక్కువ చూపుతున్నారు. ఎకరాకు 30 కట్టలకు పైగా వస్తాయి. యంత్రాలతో కోసినా ఎటువంటి ఇబ్బందులు ఉండవు. వాటిలో పోషక విలువలు ఏ మాత్రం తగ్గవు.

– శ్రీకృష్ణదేవరాయులు, ఏడీఏ, పిడుగురాళ్ల

నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తాం

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే జేబీఆర్

వెల్దుర్తి: సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు అన్నారు. గురువారం మండలంలో రూ.320 కోట్లతో 23 కి.మీ.ల జాతీయ రహదారి నిర్మించేందుకు వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. శిరిగిరిపాడు నుంచి యర్రగొండపాలెం వరకు 565 జాతీయ రహదారిని నిర్మించేందుకు శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. వెల్దుర్తిలో రూ.50 లక్షలతో గిరిజన ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. మండలంలో రూ.3.50 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు కాగా రూ.1.04 కోట్ల సీసీ రోడ్ల పనులు ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో 13 రోడ్లు మంజూరు కాగా రూ.117 కోట్లతో నాలుగు రోడ్లు మాచర్ల నియోజకవర్గానికే మంజూరు కావటం హర్షించదగ్గ విషయమన్నారు. మాచర్ల మండలం తాళ్ళపల్లి గ్రామం వద్ద రూ.25 కోట్లతో కేంద్ర విద్యాలయాన్ని నిర్మించేందుకు 15 రోజుల్లో శంకుస్థాపన చేస్తామన్నారు. వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి మండలాలను సస్యశ్యామలం చేసేందుకు వరికపూడిసెల ఎత్తిపోతల నిర్మాణ పనులు త్వరలోనే మొదలు పెడతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కుర్రి పున్నారెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్, టీడీపీ జిల్లా కార్యదర్శి పంగులూరి అంజయ్య, రాష్ట్ర యూత్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, కార్యదర్శి కల్లం రామాంజిరెడ్డి, టీడీపీ నాయకులు రాజబోయిన మధుసూదన యాదవ్, యెనుముల కేశవరెడ్డి, నర్రా గురవారెడ్డి, మండలపు రామకృష్ణ, తోట వీరాంజనేయులు, మొద్దయ్య, పీఓ రవీంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు పులుసు శివారెడ్డి, పాపిరెడ్డి, సామినేని నర్సయ్య, పంచాయతీ రాజ్ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు సకాలంలో సేవలు అందించాలి



నూతనంగా నియమితులైన ఆర్‌ఐ అనిల్ కుమార్‌ను సన్మానించిన తహసీల్దార్ వాణి, వీఆర్‌ఓలు

మాచర్ల రూరల్: పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సకాలంలో రెవెన్యూ సేవలు అందించాలని తహసీల్దార్ బత్తుల వాణి కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా నియమితులైన ఆర్‌ఐ ఇంటూరి అనిల్‌కుమార్‌ను సన్మానించి ఆమె మాట్లాడారు. రెవెన్యూ ఉద్యోగ బాధ్యతలు కత్తి మీద సాము వంటిదని, అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రొటోకాల్ పాటిస్తూ సకాలంలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించాల్సిన కీలకమైన పాత్ర అన్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ అనిల్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జి.వెంకటరమణ, టైపిస్టు శ్రీవల్లి, సీనియర్ అసిస్టెంట్ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, వీఆర్‌ఓ భాస్కర్, ప్రశాంతి, జలీల్, బాషా, ఖాజావలి, వెంకట్, జలీల్, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీనివాసరావు, రెడ్డి తదితరులున్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం



మాచర్ల: వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అర్చకులు రాఘవాచార్యులు ఆధ్వర్యంలో పలువురు పుణ్యదంపతులచే శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి కల్యాణ మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవంలో అధ్యక్షులు భవనాసి వెంకటేశ్వర్లు దంపతులు, జాయింట్ సెక్రటరీ తిరివీధి వెంకట నాగేశ్వరరావు, శిరీష, రంగా సత్యం దంపతులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సన్నిధి హనుమంతరావు, కూనిశెట్టి చిన వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, కొత్త శ్రీదేవి, పరిటాల ధనలక్ష్మి, మేడా వెంకటలక్ష్మి తదితరులున్నారు. ఈ నెల 5న జరగనున్న హైందవ శంఖారావంలో ప్రతి ఒక్క హిందువు పాల్గొనాలని మేడా వెంకటలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ హిందువులంతా ఐక్యతను చాటుకోవటానికి విశ్వహిందూ పరిషత్-ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ పి.విజయ్‌కుమార్



పిడుగురాళ్ల: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించి నిరంతరం విద్యుత్ అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ పి.విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం మాచర్ల డివిజన్‌లోని విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఈ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సూచించారు. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు అవగాహన కల్పించి నూరు శాతం అప్లికేషన్‌లు 9వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించాలని, వచ్చే వేసవి కాలానికి యాక్షన్ ప్లాన్ రెడీ చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఈఈ సింగయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

వాసవి మణికంఠ క్లబ్ అధ్యక్షుడిగా కొప్పరావూరి



సత్తెనపల్లి: వాసవి మణికంఠ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొప్పురావూరి కాశీ వెంకట సుబ్బారావు నియమితులయ్యారు. వీ204–ఏ వాసవి మణికంఠ క్లబ్ అధ్యక్షుడు వనమా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి నూతన కమిటీని నియమించారు. క్లబ్ సెక్రటరీగా సూరే శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా దేవరపల్లి కాశీ విశ్వేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా అనుమాలశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పెండ్యాల సాంబశివరావుతో 1010 ఫాంను డిస్ట్రిక్ గవర్నర్ మునగాల చిరంజీవికి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ సెక్రటరీ పోతుగంటి రమేష్, ట్రెజరర్ వెల్లంపల్లి కేశవరావు, పోతుగంటి నరసింహారావు, ఆతుకూరి వెంకటహరేరామ చెంచయ్య పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్

పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీ సమీపంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు క్రెజీ బాయ్స్ జాని, సన్నీ గురువారం తెలిపారు. కన్నెగంటి భార్గవనాయుడు జ్ఞాపకార్థం పిడుగురాళ్ల ప్రీమియమ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.22,222, ద్వితీయ బహుమతి రూ.17,777, తృతీయ బహుమతి రూ.12,222, షీల్డ్‌లతోపాటు బెస్ట్ బ్యాట్స్‌మన్, బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతులు కలవన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

పిడుగురాళ్ల: మండలంలోని జూలకల్లు గ్రామ శివారు ప్రాంతాల్లో గురువారం పేకాట స్థావరాలపై పట్టణ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. కంది పొలాల్లో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.64,070 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు.

పాతపాటేశ్వరి అమ్మవారి ఆదాయం రూ.91 వేలు

గురజాల : పట్టణంలో వేంచేసియున్న పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని 16 రోజుల పండుగ సందర్భంగా హుండీ లెక్కింపు జరిగిందని గురజాల మండల దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎం.రామచంద్రరావు తెలిపారు. పెదకాకాని గ్రూపు దేవస్థానాల గ్రేడ్ 1 కార్య నిర్వహణాధికారి పి.కృష్ణంరాజు ఆధ్వర్యంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆదాయం రూ.90,677 వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో కనకదుర్గా అమ్మవారి సేవా ట్రస్టు మహిళా సేవకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారని అన్నారు. అలాగే మండలంలోని దైద గ్రామంలో కొలువై ఉన్న అమరలింగేశ్వరస్వామి దేవస్థానంలో లడ్డు ప్రసాదం, పులిహోర రుసుములను కమిషనర్ దేవదాయ ధర్మదాయ శాఖ ఉత్తర్వుల మేరకు ప్రవేశపెట్టటం జరిగిందని, లడ్డు ప్రసాదం 80 గ్రాములకు రూ.15, పులిహోర 150 గ్రాములకు రూ.10గా నిర్ణయించినట్లు చెప్పారు. ప్రసాదం రేట్లపై ఏమైనా సందేహాలు ఉంటే ఈ నెల10వ తేదీ లోపు లిఖిత పూర్వకంగా అందించాలని ఆయన తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

అమరావతి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి సహాయ సహకారాలు అందించాలని ఎంఈఓ సీహెచ్ శివబాబు అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. ఎంఈఓ మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని, పాఠశాలలను నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు షేక్ కాలేషా వలి, విప్పర్ల అరుణ రావు, పి.హనుమంతరావు రిసోర్స్ పర్సన్స్‌గా శిక్షణ ఇచ్చారు. ఎస్ఎంసీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారావమ్మ మాతాజీ ఆరాధన



బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెం శ్రీ కొండ శింగరేశ్వర స్వామి ఆశ్రమంలో మాతాజీ సీతారావమ్మ 9వ ఆరాధన గురువారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. 2017 జనవరి 2న అకాల మరణం చెందిన సీతారావమ్మ మాతాజీని స్మరించుకున్నారు. వేకువ జామున మాతాజీ ఆశీనురాలైన పవిత్ర స్థలంలో ప్రత్యేక అలంకరణలు చేశారు. జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భజన బృందం పాటలు భక్తులను అలరించాయి. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం 7 నుంచి గ్రామంలో జెండా ఊరేగింపు నిర్వహించారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది


ఎంఈఓ శివ నాగేశ్వరరావు



ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ-2 శివనాగేశ్వరరావు, మండల ఎస్టీయూ నాయకులు

రెంటచింతల: సమాజంలో అత్యంత పవిత్రమైన వృత్తి.. ఉపాధ్యాయ వృత్తి అని ఎంఈఓ-2 వై.శివ నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ 2025 క్యాలెండర్‌ను ఆయన మండల ఎస్టీయూ నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కోరారు. నూతన సంవత్సరంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమై వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి షేక్ ఆదాం, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బేబిరాణి, షేక్ ఖుద్దుస్, జిల్లా నాయకులు ఫకీర్ అహమ్మద్, అమలబాబు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, ఎస్టీయూ సీనియర్ నేత మీరావలి, సీపీఎస్ కన్వీనర్ అహమ్మద్ జానీ, మండల నాయకులు శ్రీలక్ష్మి, లింగమ్మ, రమణకుమారి, శివన్నారాయణ, సిలార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి



రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో పారాయణ చేస్తున్న భక్తులు

రెంటచింతల: మండలంలోని రెంటచింతలలో వేంచేసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం, రెంటాల గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో, తుమ్మకోట గ్రామంలోని జనార్ధన స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో గురువారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించిన ఈ ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అర్చకులు పూరిమెట్ల శేషభట్టాచార్యులు మాట్లాడుతూ భక్త వత్సలుడైన శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రీతి పాత్రమైన ఈ ధనుర్మాసంలో స్వామికి ఏ చిన్నపాటి పూజాది క్రతువైనా అమోఘ సత్ఫలితాలను ప్రసాదిస్తుందన్నారు. గోదాదేవి మార్గళి వ్రతం పేరుతో విష్ణువును ధనుర్మాసమంతా పూజించిందని, ఎంతో పవిత్రమైన ఈ ధనుర్మాసంలో గోదాదేవికి పూజలు నిర్వహించడం సంప్రదాయం అని తెలిపారు. స్వామివార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సామాజిక తనిఖీలు నిష్పక్షపాతంగా జరగాలి

ఎస్సార్పీ రాజు



మాట్లాడుతున్న ఎస్సార్పీ రాజు

దాచేపల్లి : మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల నాణ్యత పరిశీలన నిష్పక్షపాతంగా జరపాలని ఎస్సార్పీ జె.రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్, సామాజిక తనిఖీ బృందం సభ్యుల సమావేశం గురువారం జరిగింది. 2023–24 సంవత్సరంలో ఈ పథకం ద్వారా చేపట్టిన పనులపై సమీక్ష చేశారు. ఈ పథకం ద్వారా చేపట్టిన ప్రతి పనిని అలాగే చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎస్సార్పీ రాజు చెప్పారు. 14 గ్రామ పంచాయతీల్లో 7 బృందాలు ఈ తనిఖీలు చేస్తాయని, ఈ నెల 10వ తేదీన సామాజిక తనిఖీలపై ప్రజావేదిక నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కేసానుపల్లి కేజీబీవీ, దాచేపల్లి హైస్కూల్, మాదినపాడు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కూడా తనిఖీలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ కందుల జాను, ఎంపీడీవో పప్పుల రత్నం, ఏపీడీ మల్లికార్జునరావు, ఈవోపీఆర్డీ గుప్త తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారిణి సుమని, విద్యార్థినులు

సత్తెనపల్లి: విద్యార్థినులు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని వసతిగృహ సంక్షేమ అధికారి పి.సుమని అన్నారు. వెంకటపతి నగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమని మాట్లాడుతూ తెగువ, పట్టుదల, సంకల్ప బలం ఉన్న సావిత్రిబాయి పూలేని 193 సంవత్సరాల తర్వాత కూడా గుర్తు చేసుకుంటున్నామంటే ఆమె త్యాగ నిబద్ధత కారణమన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థిని జీవితంలో స్థిరపడి, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ మహిళలు, బాలికలు అనేక రంగాల్లో స్వేచ్ఛగా ముందుకు వెళ్తున్నారంటే దానికి కారణం సావిత్రిబాయి పూలే కృషి ఎంతో ఉందన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుమనీని ఫౌండేషన్ బాధ్యులు ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం లతా ప్రియదర్శిని

సత్తెనపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లతా ప్రియదర్శిని అన్నారు. పాఠశాలకు రూ. 20 వేలు విలువచేసే క్రీడా సామగ్రిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నాయకులు చౌటా శ్రీనివాసరావు, కౌన్సిలర్ సుజాత, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మారెళ్ళ వీరాంజనేయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు నాగుల్ మీరా, ఆశీర్వాదం, పురుషోత్తం నాయక్, రిటైర్డ హెచ్‌ఎం వెంటాద్రి అందజేశారు. గురువారం క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు లతా ప్రియదర్శిని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించడం వల్ల భవిష్యత్తులో మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దబడతారన్నారు. ఈ సందర్భంగా దాతలు అందించిన క్రీడా సామగ్రిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. పాఠశాల పీడీలు రియాజ్, నరసింహారావు, సుధారాణి, వెంకటేశు, కోటేశ్వరరావు, ప్రసాద్, క్రీడాకారులు ఉన్నారు.

ఐఏఎల్ 2025 కోర్టు డైరీ ఆవిష్కరణ

సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా కోర్టు ప్రాంగణంలో న్యాయ దేవత విగ్రహం వద్ద ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్–2025 కోర్టు డైరీని గురువారం ఆవిష్కరించారు. ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశెటి వేణుగోపాల్ డైరీని ఆవిష్కరించి, న్యాయవాదులకు పంపిణీ చేశారు. న్యాయవాదులు శాస్త్రి, చిన్నయ్య, భాస్కరరెడ్డి, రవి, పాపారావు, శ్రీనివాసబాబు, శేషయ్య, విజయ్‌కుమార్, వెంకటేశ్వరరావు, బాలకోటయ్య, ఖాజావలి, మూర్తి, బాబూరావు, హరిబాబు, హరినాథ్, రాజనరసింహారావు, ఏడుకొండలు, క్రిష్టారెడ్డి, కిరణ్ కింగ్, సంగీతరావు, సురేష్, హరీష్, లక్ష్మణ్, గుమస్తాలు పాల్గొన్నారు.